మాట్లాడుతున్న పట్టణ ప్రణాళిక శాఖ అనంతపురం ప్రాంతీయడిప్యూటీ డైరెక్టర్ బి.విజయ భాస్కర్, ఇతర అధికారులు

భవన నిర్మాణానికి 24 గంటల్లో అనుమతులు

- ప్రాంతీయ పట్టణ ప్రణాళిక జోనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్
- నూతన మార్గదర్శకాలపై సిబ్బందికి అవగాహన సదస్సు
- ఉమ్మడి జిల్లా పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు హాజరు

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం ఇక ఉండదని, ధరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో అనుమతులు పొంది నిర్మాణాలు ప్రారంభించుకోవచ్చని పట్టణ ప్రణాళిక శాఖ అనంతపురం ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం కర్నూలు ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో, ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మున్సిపాలిటీల పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్ ఇంజనీర్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. భవన నిర్మాణాలకు అనుమతుల్లో జాప్యాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం కొత్తగా పథకం అమలుకు శ్రీకారం చుట్టిందని, తద్వారా దరఖాస్తు పోర్టల్లో అప్లోడ్ చేసిన గంటల వ్యవధిలోనే అనుమతులు పొంది పనులు ప్రారంభించుకోవచ్చన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ సైతం పొందవచ్చన్నారు. 18 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో గ్రౌండుతో పాటు మరో నాలుగు అంతస్తుల భవన నిర్మాణాలకు వాటి యజమానుల స్వీయ ధ్రువీకరణతో కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల నుంచి ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకొవచ్చన్నారు. ఇందుకోసం సమీపంలోని లైసెన్డ్ టెక్నికల్ పర్సన్ ద్వారా దరఖాస్తులు, అనుబంధ పత్రాలతోపాటు వాటిని ధ్రువీకరిస్తున్నట్లుగా అంగీకార పత్రాన్ని ఆన్‌లైన్ భవన నిర్మాణ అనుమతి వ్యవస్థ పోర్టల్లో అప్లోడ్ చేయాలని, అర్జీతోపాటు అనుబంధ పత్రాలను పోర్టల్ ద్వారా పరిశీలించి అనుమతులిచ్చేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వం రూపొందించినట్లు వెల్లడించారు. నిర్మాణం పూర్తయ్యాక, మళ్లీ ఆన్‌లైన్ పోర్టల్లోనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. భవన నిర్మాణాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నాక పనుల నిర్వహణపై పట్టణ ప్రణాళిక అధికారులు ఇప్పటివరకు చేపట్టిన పోస్ట్ వెరిఫికేషన్ పద్ధతిలో సైతం ప్రభుత్వం చట్టసరవణ చేసిందన్నారు. సర్వే రిపోర్ట్, స్థలం విలువ ఆధారిత సర్టిఫికెట్ తదితరాలు తప్పనిసరన్నారు. దీనికి విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినట్లు ఆకస్మిక తనిఖీల్లో వెల్లడైతే అనుమతులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. టెక్నికల్ పర్సన్ల పరంగా తప్పులు చేసినట్లు నిర్ధారణైతే అలాంటి వారి లైసెన్సులు ఐదేళ్ల పాటు రద్దు అవుతుందని హెచ్చరించారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్ బాబు, జిల్లా టిడిపిసిపిఒ శశిలత, నంద్యాల అసిస్టెంట్ సిటీ ప్లానర్ మూర్తి, ఆర్‌డిటిపి టిపిఎ ఓంకార్, కుడా ఇఇ సురేష్ కుమార్, వివిధ మున్సిపాలిటీల టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, వార్డ్ ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులు ఎల్‌టిపిలు పాల్గొన్నారు.

భానుడి భగభగలు

- పెరిగిన ఎండ తీవ్రత
- 39 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఫిబ్రవరి నెలలోనే జిల్లాలో ప్రారంభమైన భానుడు భగభగలు తారా స్థాయికి చేరాయి. బుధవారం జిల్లాలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు...

ఫిబ్రవరి రెండో వారంలోనే భానుడి భగభగలు మొదలై ప్రస్తుతం ఎండ తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ప్రస్తుతం 39 డిగ్రీలకు చేరుకుంది. కర్నూలు నగరంలో బుధవారం అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగానూ అదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి,

కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, నగరాల్లోనూ అదే పరిస్థితి కనిపించింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా..

నగరం	గరిష్ట ఉష్ణోగ్రత (సెల్సియస్‌లో)
కర్నూలు	39
ఆదోని	38
ఎమ్మిగనూరు	38
పత్తికొండ	37
మంత్రాలయం	38
కోడుమూరు	38
ఆలూరు	38

ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు పంపండి

ప్రజాశక్తి - కర్నూలు కలక్టరేట్

ఎన్నికల ప్రక్రియ నిర్వహణను బలోపేతం చేసేందుకు, పారదర్శకంగా నిర్వహించుటకు అపరిష్కృతంగా ఉన్న పలు ఎన్నికల ప్రక్రియ అంశాలకు గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీల ప్రతినిధుల భాగస్వామ్యం, సలహాలు సూచనలు అమూల్యమైనవనీ భారత ఎన్నికల సంఘం సూచించింది. సలహాలు సూచనలను ఏప్రిల్ 30 నాటికి తెలపాలని భారత ఎన్నికల సంఘం ఆహ్వానించింది.

ఎస్‌సి,ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు సాయం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గృహ నిర్మాణాలకు సంబంధించి ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి గ తేడాది డిసెంబర్ 10 నాటికి పురోగతిలో ఉన్న ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం చేసేందుకు సిద్ధమైందన్నారు.ఎస్‌సి, బిసి లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు రూ.75 వేలు, పివిటిజిలకు రూ.1.00 లక్ష అదనపు ఆర్థిక సాయం నిర్ణయించిందన్నారు. జిల్లాలో హౌసింగ్ కింద రూ.39 వేల వరకు ఇళ్లను మంజూరు కాగా, ఇందులో రూ.22 వేల 590 ఇళ్లను పూర్తి చేశారు. ఇంకా 16091 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హౌసింగ్ పథకం కింద 9446 మంది ఎస్‌టి, ఎస్‌సి, బిసి లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఇందులో 4028 మంది ఎస్‌సిలు, 5170 మంది బిసిలు, 248 మంది ఎస్‌టిలు ఉన్నారన్నారు. జిల్లాలో అదనంగా రూ.47.85 కోట్ల ఖర్చవుతుందన్నారు. మరో 2 రోజుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఇన్చార్జిలు లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న అదనపు ఆర్థిక సాయం గురించి వివరిస్తారన్నారు. జిల్లాలో బేస్‌మెంట్ లెవెల్‌లో 7 ,900 మంది ఇళ్ళు ఉన్నాయని, ఎల్‌ఎల్‌లో 1000 ఇళ్ళు, రూఫ్ లెవెల్ లో 1500 ఇళ్ళు, రూఫ్‌కాస్ట్ స్థాయిలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయని, వివిధ కారణాల వల్ల ఇళ్ళ నిర్మాణాలు ఆగి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇంటి స్థలాలకు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. సమావేశంలో హౌసింగ్ పిడి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రంహోం, ఎంఎస్ఎంఇ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదేశించారు.. బుధవారం మండల స్పెషల్ అధికారులతో, ఎంపిడిఒలు మునిసిపల్ కమిషనర్ లతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్ఎంఇ సర్వేకు సంబంధించి గత వారంలో నిర్వహించిన సర్వేను పూర్తి చేయాలన్నారు. కౌతాళం, ఆదోని, హోళగుంద, చిప్పగిరి, మంత్రాలయం, పత్తికొండ, పెద్ద కడుబూరు మండలాలు వెనుకబడి ఉన్నాయని, సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సిటిజన్ ఇకెవైసి లో జిల్లా చాలా వెనుకబడి ఉందన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీల పరిష్కారాన్ని వారంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. ఓర్వకల్లు, కృష్ణగిరి మండలాలో ఎక్కువ శాతం పెండింగ్ లో ఉన్నాయన్నారు.

యువతను మోసగించిన కూటమి సర్కార్

- 'యువతపోరు'తో వైసిపి నిరసన ప్రదర్శన
- కలెక్టర్ రంజిత్ బాషకు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, యువత నిరుద్యోగభృతి వెంటనే చెల్లించాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి ఆధ్వర్యంలో 'యువత పోరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్నూలు నగరంలోని ధర్నా చౌక్ నుండి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి.మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వై.బాలనాగిరెడ్డి, విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, వై.సాయి ప్రసాద్ రెడ్డి ,మాజీ ఎంపీ బుట్టా రేణుక, నగర మేయర్ బివై రామయ్య, కోడుమూరు నియోజకవర్గ నాయకులు ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు తెర్నకల్ సురేందర్ రెడ్డి, వైసిపి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ లు పాల్గొన్నారు. 'సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి. విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి వెంటనే ఇవ్వాలి. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలి. హామీల అమలులో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ బాధ్యత వహించాలి'.. అంటూ నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం యువతను మోసగించిందని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా ఇబ్బందుల గురిచేస్తున్నారని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండడంతో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మెడికల్ కళాశాల నిర్మాణాలను చేపడితే ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. ఈ కళాశాలలను కూడా ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందన్నారు. కూటమి సర్కార్ విద్యార్థులను యువతను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని వారు ప్రజలను కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయర్,వైసిపి నాయకులు

ప్రదర్శనలో పాల్గొన్న వైసిపి నాయకులు

రజకవృత్తిదారుల పట్ల పాలకుల చిన్న చూపు

ఎపి ఆర్‌విఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రజక వృత్తిదారుల సమస్యల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఎపి రజక వృత్తిదారుల సంఘం(ఎపి ఆర్‌విఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కరయ్య చెప్పారు. బుధవారం ఎపి రజక వృత్తిదారుల ప్రాక్షన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎం.భాస్కరయ్య ప్రజాశక్తితో మాట్లాడుతూ విశ్వకర్మ కౌసల్య యోజన పథకం రజకులందరికీ ఐదు శాతం వడ్డీతో రుణాలు ఇస్తామనడమే దుర్మార్గమన్నారు. రూ.వేలకోట్లు బ్యాంకులకు ఎగ్గొట్టిన దొంగలకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మాఫీ చేస్తూ ఉన్నారన్నారు. ఆధునిక వ్యవస్థలో ఒకపక్క చేతివృత్తులు దెబ్బతింటున్న సమయంలో మోడీ ప్రభుత్వం వత్తిదారులను ఉద్దరిస్తానని చెప్పి ఐదు శాతం వడ్డీతో రుణాలు ఇప్పిస్తాననడం సిగ్గుచేటన్నారు. ఈ అంశాన్ని గతంలో వైసిపి ప్రభుత్వం , ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఇది అన్యాయమని అడిగిన పాపాన పోలేదనీ చెప్పారు. రాష్ట్రప్రభుత్వం ఆదరణ పథకం మూడు ప్రారంభిస్తామని చెప్పి సుమారు ఎపిలో 69 వృత్తులలో కోట్లాదిమంది ప్రజలు ఇప్పటికీ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వ వ్యవహారం కోడిపైన కట్టి మాంసం తింటున్నట్లు ఉందన్నారు. ఈ పథకం ద్వారా రూ.47 వేలకోట్లు బీసీల కోసం బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి , ఆ బడ్జెట్లో వృత్తిదారుల ఊసే లేదని అన్నారు. 56 కార్పొరేషన్ల విధివిధానాలు లేవన్నారు. ఈ నిధులలో నుంచి ఇంత ఖర్చు చేస్తామని చెప్పిన మాట లేదు. ఈ ప్రభుత్వాలు చెప్పిన మాట ప్రకారం చిత్తశుద్ధితో పనిచేయాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని చెప్పిన మాట తొమ్మిది నెలల పరిపాలనలో మంత్రులు కమిటీ దగ్గరే ఆగిందన్నారు. వెంటనే అట్రాసిటీ చట్టం లాగా రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రజకులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అమలు చేయాలన్నారు. రజకులకు చెరువులు కుంటలపై పూర్తి హక్కు కల్పించాలని కోరారు. జీవో నెంబరు 27 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

ఇఫ్తార్ విందులో హాఫీజ్ ఖాన్‌కు ఫలహారం తినిపిస్తున్న వైసిపి నాయకులు

ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు నగరంలోని ఓల్డ్ టౌన్ మసీదులో 8వ వార్డు వైసిపి నాయకుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే హాఫీస్ ఖాన్ ఇఫ్తార్ విందుకు హాజరై ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లకోమాపై అవగాహనకు ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గ్లకోమా వారోత్సవాల సందర్భంగా ఈ నెల 9 నుంచి 15వరకు వరకు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. బుధవారం ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి, కర్నూలు ప్రాంతీయ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కంటి వైద్యశాల వైద్యులు, సిబ్బంది కంటి ప్రాంతీయ హాస్పిటల్ నుండి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి క్యాజువాలీటి విభాగం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్లకోమా అనేది ఒక కంటి వ్యాధి, ఇది కంటిలోని ఒత్తిడి పెరగడం వల్ల కంటి నరాలకి నష్టం కలిగించే ప్రమాదం ఉందని అన్నారు. ముందుగా గుర్తించి చికిత్స చేయకపోతే దృష్టి నష్టం లేదా అంధత్వానికి దారితీస్తుందని తెలిపారు. 40 ఏళ్ళు పై బడి బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు నిరంతరం చెక్ చేసుకుంటూ ఉండాలని అన్నారు. కంటిలో ఉండే ఒత్తిడి 12 నుంచి 20 మధ్య ఉంటుందని 22 పైన ఉంటే దానిని గ్లకోమా అంటారు. దీని ద్వారా కంటికి ఉండే ప్రధానంగా నరం మెత్తబడి నీరు లాంటి ద్రవం ఎక్కువగా తయారై దీనివల్ల కంటి చూపు తగ్గిపోయి అంధత్వం వస్తుందని అన్నారు. రెగ్యులర్‌గా కంటి చెకప్ చేసుకుంటూనే వారసత్వంగా వచ్చేవారు బిపి, షుగర్ ఉన్నవారు, ఇతర జబ్బులకు స్టెరాయిడ్స్ వాడేవారు ఈ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. దీనిని త్వరగా గుర్తించి డాక్టర్స్‌తో చూపించుకోవడం ద్వారా డ్రాప్స్, మందుల ద్వారా కొంతవరకు అరికట్ట వచ్చిందని తెలిపారు. దీనిని చూయించుకోకపోతే అంధత్వానికి దారితీస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమములో కంటి ప్రాంతీయ హాస్పిటల్ ప్రొఫెసర్ సత్యనారాయణ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరప్రసాద్, డాక్టర్ శివ ప్రియ, ఆర్ఎంఒ డాక్టర్ జి.భరత్, వైద్యులు, స్టాఫ్ నర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచగ్లకోమా దినోత్సవం సందర్భంగా ప్రదర్శన

చిన్న వయస్సులో గుండెజబ్బులెందుకు?

-జీవనశైలి ,ఆహారపు అలవాట్ల మార్పుతో నివారణ

-కార్డియాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ సూచనలు సలహాలు

కర్నూలు-ప్రజాశక్తి హాస్పిటల్

ఈ మధ్యకాలంలో చిన్న వయసులోనే గుండెపోటుకు గురై చనిపోతున్నారు. దీనికి ప్రధానకారణం జీవనశైలిలో వస్తున్న మార్పులు, ఆహారపు అలవాట్లతో గుండెపోటు వస్తుందని ప్రముఖ కార్డియాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ కార్డియాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ప్రశాంత్ ప్రజాశక్తితో తెలిపారు. ఆయన మాటలో... ఈ మధ్యకాలంలో సాధారణంగా 40 ఏళ్ల వయసులోపు వారికి కూడా ఎంతో మందికి హార్ట్ ఎటాక్ వస్తుంది. దీనికి ముఖ్య కారణాలు కొన్ని ఉన్నాయి. అందులో చెడు అలవాట్లు ఇందులో ప్రధానమైనవి. స్మోకింగ్‌ను చాలా చిన్న వయసులోనే ప్రారంభించడం, ఎక్కువగా స్మోక్ చేయడం. దీర్ఘకాలికంగా స్మోక్ చేయడం. ఇవి రిస్క్ ఫ్యాక్టర్‌లా ఉంటున్నాయి. ఎక్కువ స్మోకింగ్ చేసే వారికి గుండెల్లోని రక్తనాళాలలో గడ్డకట్టే స్వభావం ఉంటుంది. దానివల్ల రక్తనాళాల్లో రక్తం గడ్డలు అడ్డం పడి సడన్‌గా హార్ట్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాంటివారు త్వరగా హాస్పిటల్‌కు రాగలిగితే బతకడానికి అవకాశాలుంటాయి. లేని న వ ు య ౕ ు ం లో కుప్పకూలి చనిపోయే అవకాశం ఎక్కువ. దీనితోపాటు రెండవ కారణం అన్‌హెల్తీ లైఫ్ స్టైల్. సరైన ఆహారం తీసు కోకపోవడం. ఎక్కువగా బయటి ఆహారం తీసు కోవడం. ఎక్కువగా ఆయిల్ ఫుడ్ తీసుకోవడం. ఫాస్ట్ ఫుడ్ తినడం. కల్తీ నూనెతో తయారుచేసిన ఆహారం తీసుకోవడం. సరైన టైంలో ఆహారం తీసుకోకపోవడం. దీనివల్ల చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా పేరుకుంటుంది. దీనివలన రక్తనాళాల్లో పేరుకుపోయి రక్తనాళాలు సన్నబడడానికి, రక్తం గడ్డ కట్టడానికి దారితీస్తాయి. ఈ రెండు ముఖ్య కారణాలవల్ల చిన్న వయసులోనే గుండెపోటు రావడానికి ఎక్కువగా అవకాశాలున్నాయి.



నివారణ చర్యలు: లైఫ్ స్టైల్ మార్చుకోవాలి. ముఖ్యంగా స్మోకింగ్ అలవాటు ఉంటే మానుకోవాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయాలి. తినే ఆహారం మీద నియంత్రణ ఉండాలి. వీలైనంతవరకు ఇంటిలోనే భోజనం చేయాలి.ఆయిల్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. ఆరోగ్యవంతమైన జీవితానికి అలవాటు పడటం ద్వారా గుండెపోటును నివారించుకోవచ్చు.

గుర్తించడానికి వున్న అవకాశాలు

40 సంవత్సరాలు పై బడిన వారు తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి. రిస్క్‌ఫ్యాక్టర్స్‌ఉన్నవారు వైద్యుల సలహాతో సంవత్సరానికోసారి గుండె పరీక్షలు చేయించుకుంటే మంచిది. సాధారణంగా ఇసిజి, 2డి ఇకో, టిఎంటి టెస్ట్, వీటితోపాటు కొలెస్ట్రాల్ టెస్ట్, షుగర్ పరీక్షలు చెక్ చేసుకుంటూ ఉండాలి. వీటి ద్వారా గుండెపోటును నివారించడానికి అవకాశం ఉంటుంది.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కర్నూలుకు సముచితస్థానం

-టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎమ్మెల్యేల కోటాలో ఏర్పడిన రాష్ట్ర శాసనమండలి స్థానాలకు టిడిపి అభ్యర్థులుగా పోటీ చేసేందుకు బిసి, ఎస్‌సి సామాజికవర్గాల వారికి అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అవకాశం కల్పించినందుకు టిడిపి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కర్నూలు టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు జిల్లా, మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన బిటి.నాయుడుకు 2వసారి అవకాశం కల్పించి కర్నూలు జిల్లాపై పార్టీ అధినేత తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. కర్నూలు జిల్లాకు ఇంత గొప్ప అవకావశం కల్పించిన అదినేత చంద్రబాబుకు , నారా లోకేష్ కు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యావంతులు పార్టీలో అంకిత భావంతో పనిచేసి 2వ పర్యాయం ఎమ్మెల్సీగా ఎన్నికయిన బిటి. నాయుడుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజులలో రాజకీయంగా మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లా, సొంత నియోజకవర్గం మంత్రాలయానికి మంచి పేరు ప్రఖ్యాతులు తెస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఎంఎం విజయభాస్కర్‌రెడ్డి

పొదుపు మహిళల ఆర్థిక ఎదుగుదలకు కృషి

సిఎంఎం విజయ భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని సిఎంఎం విజయ భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం సిరి, శ్రీదత్త ఐక్య మహిళ పరస్పర సహాయక సహకార పొదుపు , పరపతి సంఘం 2023-24 వార్షిక మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు వ్యాపార ఆర్థిక లావదేవీలు నిర్వహిస్తూ అభివృద్ధి చెందాల్సిన అవసరం ప్రస్తుతం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళల అభివద్ధికి పాటు పడుతుందని ఎండి పొదుపు గ్రూపులను, మహిళలను స్వతంత్రంగా ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగి ఉండ వచ్చని వాటిని అధిగమించి అభివృద్ధి చెందాలని మా వంతు సహకారం మా పరిధిలో అందిస్తామన్నారు. సిఒ పుష్పవతి, ఆర్‌పిలు ఎస్.ఉమాదేవి, సి. మంజుల, సిరి ఐక్య సంఘం అధ్యక్షులు వి.రాధిక, కార్యదర్శి బి. హైమావతి, శ్రీదత్త ఐక్య సంఘం అధ్యక్షులు ఎం.వాణిశ్రీ, కార్యదర్శి కె.ఊర్మిళ, కోశాధికారి పి. లక్ష్మినారాయణమ్మ, ఇ సి మెబర్లు, పద్మజ, చంద్రకళ,ఎ.సౌమ్య, పి. జ్యోతి, మల్లికా, సావిత్రి, శ్రీలత, గౌసియా,వసంత, పరిమళ, సుభద్రమ్మ, సుబ్బలక్ష్మి, స్వరూప, తదితరులతో పాటు 320 మంది పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

- ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు షేకున్ బీ

ప్రజాశక్తి - ఆలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర నాయకులు షేకున్ బీ కోరారు. బుధవారం ఆలూరులోని జ్యోతి బసు భవన్‌లో ఐద్వా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కార్యదర్శి రత్నమ్మ ఐద్వా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా షేకున్ బీ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలేవీ అమలు చేయకుండా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఎన్నికల్లో మహిళలకు ఆశ చూపి ఓట్లు దండుకొని మహిళలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఐద్వా నాయకులు గౌసియా బీ, నాగమణి, రాధమ్మ, భారతి, విజయలక్ష్మి, రంగమ్మ పాల్గొన్నారు.

ఐద్వా జెండాను ఎగురవేస్తున్న రత్నమ్మ

ప్రతి రైతుకూ సాగునీరందిస్తాం

- టిడిపి ఇన్‌ఛార్జి రాఘవేంద్రారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

ప్రతి రైతుకూ సాగునీరందించి రైతు అభివృద్ధి కోరుకునే ఏకైక ప్రభుత్వం కూటమి అని టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జి రాఘవేంద్రారెడ్డి తెలిపారు. బుధవారం రైతులతో కలిసి పులికనుమ ప్రాజెక్టు నుంచి పీకల బెట్ట గ్రామం వరకు చేపడుతున్న పైపు లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతులను పూర్తిగా మోసం చేశాయని, కోసిగి గ్రామ సమీపంలో ఉన్న పులికనుమ ప్రాజెక్టు నుంచి ఇంతవరకు సాగు, తాగునీరు ఇవ్వకుండా హామీలిచ్చి కనుమరుగయ్యారని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వమంటే మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని నిరూపించి ప్రతి రైతుకూ సాగునీరు అందించి న్యాయం చేస్తామన్నారు. టిడిపి ప్రభుత్వంలో రూ.7 కోట్లు పులికనుమ పైపు లైన్ కోసం మంజూరు చేసిందన్నారు. ఐదు కిలోమీటర్ల మేర వేసే పైపు లైన్ పనులను పరిశీలించి, మధ్యలో వాల్వ్ ఏర్పాటు కోసం సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతుల కోరిక మేరకు మధ్యలో డిసి పాయింట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. డిసి పాయింట్లు ద్వారా దాదాపు 2 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రేమ్, ఇంజినీర్ మణికుమార్, టిడిపి నాయకులు రామిరెడ్డి, ఒక్కలి వెంకటేశ్వర్లు, జ్ఞానేష్, జక్కనగేని వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, అయ్యన్న, అర్జున్, కప్పయ్య, బిజెపి నాయకులు రాముడు, రైతులు ముకుంద కిష్టప్ప, బసవరాజు, ఈరన్న, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

పైపులైన్ పనులను పరిశీలిస్తున్న రాఘవేంద్రారెడ్డి

గద్దెరాళ్ల మట్టి రోడ్డుకు మరమ్మతు పనులు

ప్రజాశక్తి - దేవనకొండ

గద్దెరాళ్ల దేవర సందర్భంగా కర్నూలు రోడ్డు నుంచి గద్దెరాళ్ల గ్రామం వరకు మట్టిరోడ్డు మరమ్మతు పనులను వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ బుధవారం ప్రారంభించారు. మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్ ఉప్పర్‌పల్లి, టిడిపి నాయకులు గిడ్డయ్య గౌడ్, మల్లికార్జున గౌడ్, రాఘవేందర్ గౌడ్, అలారుదిన్నె మల్లయ్య, రామారావు నాయుడు, రాజశేఖర్ గౌడ్, మల్లెపల్లి రంగడు, గద్దెరాళ్ల, పల్లెదొడ్డి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ బొజ్జమ్మ

'ఆటో కార్మికులకు పింఛను ఇవ్వాలి'

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

50 ఏళ్లు ఉన్న ఆటో కార్మికులకు సామాజిక పింఛను ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో ఆటో కార్మికులకు యూనియన్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా ఎన్ని రూ.లక్షల కోట్లు బడ్జెట్ కేటాయించినా ఆటో కార్మికుల సంక్షేమానికి ఎటువంటి సంక్షేమ పథకాలు కేటాయించకపోవడం విచారకరమన్నారు. రాత్రనక, పగలనక కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో ఆటో కార్మికులకు ఎటువంటి సహాయం చేయలేదని చెప్పారు. ఈ బడ్జెట్‌లోనైనా ఆటో కార్మికులకు సూపర్ సిక్స్ పథకాలు, 50 ఏళ్లు నిండిన వారికి సామాజిక పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఎ.సురేష్, ఆటో యూనియన్ నాయకులు ఆమోస్, ఆంజనేయులు, నరసన్న, దేవకుమార్, ప్రతాప్, శివ, రామలింగ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దకడబూరులో ప్రజాసమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ కాలనీలో పాడుబడిన పురాతన బావి వల్ల కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారని, వెంటనే పూడ్చి వేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యల పరిష్కారానికి సాగుతున్న చైతన్య యాత్రలో ప్రజలు పాల్గొనాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు దేవదాసు, శ్రీనివాసులు, ఈరన్న, ప్రజలు పాల్గొన్నారు.

ఆదోని : సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ సదుపాయం లేక శివారు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు గ్రహించి ఏర్పాటు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. నాయకులు తిక్కప్ప, కృష్ణమూర్తి, వెంకటేష్‌తో కలిసి అమరావతి నగర్‌లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. స్థానిక సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వీడాలన్నారు. పట్టణంలోని అమరావతి నగర్ కాలనీలో ఏ వీధికి వెళ్లినా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని తెలిపారు. డ్రెయినేజీలు, సిసి రోడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వీధుల్లో దుర్వాసన వెదజల్లుతోందని, చిన్నపాటి వర్షం వచ్చినా బయటకు రాలేని పరిస్థితి ఉందని తెలిపారు. రోడ్డుపై ముళ్ల చెట్లు పెరిగాయని, తొలగించే నాథుడే లేరని చెప్పారు. రేషన్ బియ్యం సరిగా అందడం లేదని, వీధుల్లో లైట్లు సక్రమంగా వెలగడం లేదని తెలిపారు. నీటి ట్యాంకు చెడిపోయిందని, మరమ్మతులు చేసే వారు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అమరావతి నగర్‌లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను అధికారుల దృష్టికి వెళ్లి పరిష్కార దిశగా ఆందోళన చేస్తామన్నారు.

కౌతాళం : మండలంలోని చూడి నుంచి కరని వరకు రోడ్డు వేయాలని సిపిఎం నాయకులు కోరారు. బుధవారం చూడి గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య, మండల నాయకులు ఉల్లిగయ్య, రామాంజనేయులు ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. చూడి గ్రామంలో వీధులు, వీధులు తిరుగుతూ ప్రజలను కలుస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చాలాచోట్ల డ్రెయినేజీ సమస్య, సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు అవుతున్నారని తెలిపారు. చూడి నుంచి కరని వరకు రోడ్డు సమస్య ఇబ్బందిగా ఉందని, గతంలో ఈ రోడ్డే ప్రధాన రోడ్డుగా ఉండేదని చెప్పారు. మండలంలో సగం గ్రామాలు ఈ రోడ్డుమీద కోసిగి, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కర్నూలు వరకు వెళ్లేవారు ఉన్నారన్నారు. ఉరుకుంద దగ్గర ఒక రోడ్డు, హాల్వి రోడ్డు ఏర్పడడం వల్ల ఈ రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. చూడి నుంచి కోసిగికి వెళ్లాలంటే 20 కిలోమీటర్లు దూరం వెళ్లి కోసిగి వెళ్లాలని, చూడి నుంచి కోసిగికి 10 కిలోమీటర్లు దూరమని తెలిపారు. ఈ రోడ్డు వేస్తే ప్రజలకు, వ్యాపారులకు, రైతులకు అనుకూలంగా ఉంటుందని, కూటమి నాయకులు జోక్యం చేసుకొని రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రామాంజనేయులు, ఉల్లిగయ్య, బసవరాజు, ప్రకాష్, వీరేష్, గుండప్ప పాల్గొన్నారు.

పెద్దకడబూరులో మాట్లాడుతున్న నాయకులు

ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

కౌతాళం : గ్రామంలో పర్యటిస్తున్న నాయకులు

వేరొకరి పనులు చేయకూడదు...

- ఏపీడీ పద్మావతి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఉపాధి హామీ పనులు చేసుకునే వారందరూ ఒకరి పేరు మీద మరొకరు చేసుకోకూడదని, ఉపాధి హామీ చట్టం ప్రకారం ఇది నేరమవుతుందని ఆలూరు ఏపీడీ పద్మావతి తెలిపారు. దౌల్తాపురం గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం గ్రామ సచివాలయంలో ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆమె ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమాధానాలు రాబట్టారు. అనంతరం తమకు పెండింగ్లో ఉన్న వేతనాలు సకాలంలో అందేలా చూడాలని ఉపాధి కూలీలు ఆమెను నిలదీశారు. సమావేశం అనంతరం ఆమె మాట్లాడుతూ... తమకు కావాల్సిన ఇరువైపుల ఉన్న సమాచారం అంతా కూడా తెలుసుకున్నామని, వివరాలు కూడా ఉన్నతాధికారులతో మాట్లాడిన తర్వాత తెలుపుతానని అన్నారు. గ్రామాల్లో తగాదాలు లేకుండా ప్రశాంతంగా ఉపాధి హామీ పనులు చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ సిబ్బంది కూడా రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకుండా పనులపై దృష్టి పెట్టాలని తెలిపారు. వారానికోసారి ఉపాధి హామీ కూలీలతో గ్రామ సభలు నిర్వహించి ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. వేతనాలు కూడా ఈ రెండు, మూడు రోజుల్లో కూలీల ఖాతాలకు జమ అవుతాయన్నారు. టిడిపి నాయకులు మేకల రామాంజనేయులు, హరినాథ్, పంచాయతీ కార్యదర్శి సుధీర్, టెక్నికల్ అసిస్టెంట్ మారుతి, డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్, మహిళా పోలీసు గౌరీ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ పద్మావతి

వైసిపి అంటేనే సంక్షేమ పథకాలు

- పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

వైసిపి ప్రభుత్వంలో కరోనా కాలంలో కూడా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ అయ్యాయని, వైసిపి అంటేనే సంక్షేమ పథకాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. బుధవారం వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున అధ్యక్షతన వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు పాతబస్టాండ్ ఆవరణలో పార్టీ జెండాను ఎమ్మెల్యే విరుపాక్షి ఆవిష్కరించారు. వాల్మీకి, అంబేద్కర్, వైస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని విమర్శించారు. అనంతరం 'యువత పోరు.. చలో కలెక్టరేట్'కు భారీ ఎత్తున కర్నూలుకు బయల్దేరారు. **ఎమ్మిగనూరులో** వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ఆదేశాల మేరకు వైసిపి 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైసిపి కార్యాలయం వద్ద వైసిపి జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్ఆర్ కూడలిలో కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షులు వై.రుద్రగౌడ్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప మాట్లాడారు. ప్రజా సంక్షేమ పార్టీ వైసిపి అని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందని తెలిపారు. పార్టీ సేవలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేలా కృషి చేయాలని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల రూపంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. **గోనెగండ్లలో** వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి టికె.బందేనవాజ్ వైసిపి జెండాను ఆవిష్కరించారు. వైసిపి బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మురళీ నాయుడు, యువ నాయకులు ఇమ్రాన్, గోవిందు, కె.పద్మనాభం, మాబువలీ, బగిలి ఉస్మాన్, రఫీ, చికెన్ రాజా పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి


గోనెగండ్లలో...

సొసైటి సిఇఒగా రవి కుమార్

ప్రజాశక్తి - ఆస్పరి

జిల్లా డిఎల్ఇసి ఆదేశాల మేరకు ఆలూరు బ్యాంకు మేనేజర్ రవిప్రకాష్ ఆధ్వర్యంలో సిఇఒగా మేకల రవి కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సొసైటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రైతులకు అందుబాటులో ఉండి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందేలా చూస్తామన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సొసైటీ అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం టిడిపి, జనసేన నాయకులు రవికుమార్‌ను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, తెలుగు యువత నాయకులు రఘు యాదవ్, జనసేన మండల అధ్యక్షులు అరవింద్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పార్కు రోడ్డు, గాంధీ సర్కిల్, సోమప్ప సర్కిల్, లక్ష్మి పేట, ఆదోని బైపాస్ రోడ్డు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేసి కంపోస్టు యార్డుకు తరలించాలని ఆదేశించారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - కోసిగి

అక్రమంగా పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ట్రాక్టర్లతో తొక్కించి ధ్వంసం చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కోసిగి, కౌతాళం మండలాల్లో మొత్తం 105 కేసుల్లో, 2,442 లీటర్ల (రూ.12,27,600 విలువ గల) మద్యాన్ని ధ్వంసం చేశారు. కర్ణాటక మద్యం అక్రమంగా తరలించినా, వారికి సహకరించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిఐ భార్గవ రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్, సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ ఇష్టంతో చదవాలి

- ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్

ప్రజాశక్తి - కోసిగి

ప్రతి విద్యార్థీ కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్ తెలిపారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సరస్వతి పూజ నిర్వహించారు. రాబోయే పదో తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థీ పరీక్షలంటే భయం వీడి ఒక పండగలా పరీక్షలు రాయాన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో, నృత్యాలతో అలరించారు. పాఠశాల ఆవరణంలో భోజనం ఏర్పాటు చేశారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

- జనసేన పార్టీ మండల కో కన్వీనర్ మహానంది

ప్రజాశక్తి- దేవనకొండ

ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండల కో కన్వీనర్ మహానంది (నందు) కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. జనసేన పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కూటమి అధికారంలోకి వచ్చాక జరుగుతున్న తొలిసభ కావడంతో నియోజకవర్గంలోని 6 మండలాల నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, రెట్టింపు ఉత్సాహంతో సభకు తరలిరావాలని తెలిపారు.

వైభవంగా మూగి తాత దర్గా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండలో వెలసిన మూగి తాత ఉరుసు ఉత్సవాలు బుధవారం వైభవంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి దర్గాను వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరైన భక్తాదులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్గా కమిటీ కార్యనిర్వహకులు భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. డోన్ మాజీ ఎమ్మెల్యే మాదన్న జ్ఞాపకార్థం ఆయన మనవడు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

శ్రీమఠంలో ఘనంగా శ్రీధీరేంద్ర తీర్థుల ఆరాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు శ్రీధీరేంద్ర తీర్థుల ఆరాధనను ఘనంగా నిర్వహించారు. బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని హోసరిత్తిలో శ్రీధీరేంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవం సందర్భంగా మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని వెండి కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. నైవేద్య సమర్పణతో మంగళ హారతులిచ్చారు. శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులకు వేదపరీక్షతో పాటు ప్రముఖ పండితులు ప్రవచనాలతో ఇష్టాగోష్టి నిర్వహించారు.

చిన్నపిల్లల ప్రాణాలతో వైద్యుల చెలగాటం

- ప్రజా సంఘాల విమర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చిన్నపిల్లల ప్రాణాలతో ప్రభుత్వ వైద్యులు చెలగాటమాడుతున్నారని అడ్వకేట్ ఎ.తిమ్మప్ప, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాజీవ్ విమర్శించారు. బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ మాధవి లత వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ వైద్యులు వారి డ్యూటీ టైంలో హాస్పిటల్‌లో ఉండకుండా ప్రయివేట్ హాస్పిటల్‌లో ఉంటూ అంతా స్టాఫ్ నర్సులతోనే వైద్యం చేస్తున్నారని తెలిపారు. ప్రసవం అయిన తర్వాత పిల్లలకు సీరియస్ ఉంటే డాక్టర్లు ఫోన్‌లోనే రిపోర్ట్ ఇచ్చి వెంటనే 'కర్నూలుకు రెఫర్ చేయండి' అంటూ బాధితులను వెయిటింగ్‌లో పెట్టి వారి జీవితాలతో ఆటాడుకుంటున్నారని చెప్పారు. దానివల్ల శిశువులు పుట్టిన వెంటనే చనిపోతున్నారని, ఏమని అడిగితే 'మీరెవరు.. మీకేం సంబంధం' అంటూ మాట్లాడుతున్నారని తెలిపారు. 'ప్రయివేట్ హాస్పిటల్‌కు పోవాలి. గవర్నమెంట్ హాస్పిటల్‌కు ఎందుకు వస్తారు. మాకేం సంబంధం' అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం, కించపరచడం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో డిఎంహెచ్ఒ జోక్యం చేసుకొని పసికందుల ప్రాణాలను కాపాడాలని, వైద్యులు హాస్పిటల్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేటట్లు చేయాలని కోరారు. ప్రభుత్వ వైద్యులు ఎవరూ ప్రయివేట్ హాస్పిటల్ పెట్టుకొని వైద్యం నిర్వహించకూడదన్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో అయినా పనిచేయాలని, ప్రయివేట్ హాస్పిటల్‌లో అయినా పని చేయాలని తెలిపారు. రెండు చోట్లా ఉంటే రోగులకు వైద్యం సక్రమంగా అందించకపోవడం వల్ల చనిపోతున్నారని చెప్పారు. భవిష్యత్తులో ఇటువంటి మరణాలు జరగకుండా వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

మాధవి లతకు వివరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రా రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్రా రెడ్డి తెలిపారు. బుధవారం బదినేహాల్ గ్రామానికి చెందిన మహబూబ్ వలీ, షేక్షావలీకి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బదినేహాల్ గ్రామంలో మహబూబ్ వలీకి గతేడాది గుండెపోటు రావడంతో హైదరాబాద్ ప్రయివేట్ హాస్పిటల్‌లో దాదాపు రూ.3 లక్షలకు పైగా ఖర్చు పెట్టారని తెలిపారు. పి.షేక్షావలీకి కిడ్నీ సమస్య వల్ల కర్నూలు ప్రయివేట్ ఆస్పత్రిలో దాదాపు రూ.75 వేలు ఖర్చు పెట్టినట్లు చెప్పారు. రెండు కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసేందుకు తాను, టిడిపి సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య కృషి చేసినట్లు తెలిపారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రూ.1,53,576ను రాఘవేంద్రా రెడ్డి స్వగృహంలో అందజేశారు. టిడిపి గ్రామ ఇన్‌ఛార్జీ నరసింహులు, షబ్బీర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాఘవేంద్రా రెడ్డి

సంపద సృష్టించే కేంద్రాలుగా మలచుకోవాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లను క్లాప్ మిత్రలు, పారిశుధ్య సిబ్బంది సహకారంతో సంపద సృష్టించే కేంద్రాలుగా మలచుకోవాలని ఆదోని డిఎల్‌పిఒ నూర్జహాన్ తెలిపారు. గోనెగండ్ల మేజర్ పంచాయతీ చెత్త సంపద కేంద్రం వద్ద బుధవారం ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో క్లాప్ మిత్రలు సేకరించిన చెత్తను కేంద్రాలకు చేర్చడం, చేర్చిన తర్వాత వాటిని వివిధ రకాలుగా వర్గీకరించుకోవడం, వాటి నుంచి వర్మీకంపోస్టును తయారు చేసి విక్రయించడంతో పాటు మిగిలిన వ్యర్థాల నుంచి ఏ మార్గంలో సంపదను ఎలా సృష్టించుకోవాలన్న విషయాలపై ఎఫ్‌టిసి నాగరాజు ద్వారా వివరించినట్లు తెలిపారు. శిక్షణలో ఇక్కడ చెప్పిన విషయాలను ప్రతి పంచాయతీలో అమలుపరచి పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి అనంతశయన, నందవరం ఇఒఆర్‌డి సందీప్, సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

ఆలూరు సిఐ బదిలీ

ప్రజాశక్తి -ఆలూరు

కర్నూలు, అనంతపురం జోన్‌లో సిఐల బదిలీలు చేపట్టారు. ఐజి కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఆలూరు సిఐ బి.వెంకట చలపతి అన్నమయ్య జిల్లా రాయచోటి యుపిఎస్‌కు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా ఉమెన్ పోలీసు స్టేషన్ నుంచి ఆలూరు సిఐగా రవి శంకర్ రెడ్డి వస్తున్నట్లు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ఉత్తమ ఫలితాలకు కృషి

- డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి
- హాస్టల్ విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

విద్యార్థులు ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలని డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి సూచించారు. బుధవారం ఇంటిగ్రేడ్ హాస్టల్ పదో తరగతి విద్యార్థులకు విలేకరి విశ్వనాథ్ పెన్నులు, రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, ఎంఇఒ రఘునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరి విశ్వనాథ్ మాట్లాడారు. తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతేడాది పదో తరగతి విద్యార్థులకు తన వంతు సహాయంగా పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయం వీడి ఇష్టంతో చదవాలని చెప్పారు. అనంతరం ఎంఇఒ రఘునాథ్ మాట్లాడారు. విద్యార్థులకు మంచి మనస్సుతో సహాయం చేసినందుకు విశ్వనాథ్‌ను అభినందించారు. డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి వసతి గృహాలు వరం లాంటివని తెలిపారు. గతంలో వసతి గృహాల్లో సరైన సదుపాయాలు ఉండేవి కాదని, ఇప్పుడు ప్రభుత్వం పేద పిల్లల విద్యాభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేసి, సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యనందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న మంచి సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి హాస్టల్‌కు పేరు సాధించి పెట్టాలని వార్డెన్ క్రాంతి కుమార్ తెలిపారు. ఉరుకుంద, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందిస్తున్న వెంకటరమణారెడ్డి

ఆస్పత్రి నిర్మాణానికి స్థలం దానం

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆస్పత్రి నిర్మాణానికి గ్రామానికి చెందిన సునీల్ కుమార్ ఒక ఎకరా స్థలాన్ని ఇవ్వడానికి ముందుకొచ్చారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత నాయక్ బుధవారం గ్రామాన్ని సందర్శించారు. రెండేళ్ల క్రితం ప్రభుత్వాస్పత్రి (పిహెచ్‌సి) మంజూరయింది. గతంలో స్థల దాతలు ముందుకు రాకపోవడంతో సర్పంచి అరుణ్ కుమార్ గ్రామ కంఠంలోని సర్వే నెంబర్ 46/1లో 1.50 ఎకరా స్థలాన్ని సర్వే చేయించి తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టర్ ద్వారా అనుమతి లభించింది. టెండర్ ద్వారా అగ్రిమెంట్ కూడా ఇచ్చారు. 2024 మార్చిలో ఆస్పత్రి నిర్మాణనికి భూమి పూజ చేశారు. దీనికి సంబంధించిన మెటీరియల్ స్టీల్, సిమెంట్ కూడా దిగుమతి చేసుకున్నారు. 2024 మే తర్వాత కొందరు నాయకులు ఇక్కడ ఆస్పత్రి నిర్మాణానికి సరైన వసుతులు లేవని, జగనన్న కాలనీలో అనుకూలంగా ఉందని, పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను బలవంతంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా లబ్ధిదారుల నుంచి పట్టాలు తీసుకుంటున్నారని సర్పంచిగా తన దృష్టికి వచ్చిందని తెలిపారు. విషయం తెలుసుకొని పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను వెనక్కి తీసుకొని ఎందుకు ఇబ్బంది పెట్టాలని, గ్రామంలోని కొందరు స్థల దాతలను సంప్రదించినట్లు తెలిపారు. పెద్దింటి మొగతాల్ జీవరత్నం కుమారుడు మొగతాల్ సునీల్ కుమారు సర్వే నెంబర్ 36-1లో భూమిలోని ఒక ఎకరా భూమిని ఇస్తానని స్వచ్ఛందంగా ముందుకొచ్చారని చెప్పారు. ఆర్‌డిఒ భరత్ నాయక్ స్థల దాత పొలాన్ని పరిశీలించి జెసికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. దేవనకొండ తహశీల్దార్ ప్రసాద్ రాజు, విఆర్ఒ షఫీ, స్థల దాత ఎం.సునీల్ కుమార్, సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్, మాజీ ఎంపిటిసి చాప ఈరన్న, గ్రామ పెద్దలు సామ్యేల్, శ్యామ్సన్, అబ్రహం, ఏసేపు, ఇమ్మానుయేలు, నాగన్న, నరేష్ పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు స్థలాన్ని చూపిస్తున్న సర్పంచి అరుణ్ కుమార్

'యువతను మోసం చేసి పోరు డ్రామానా'

ప్రజాశక్తి- గోనెగండ్ల

గత వైసిపి ప్రభుత్వం యువతను జాబ్ క్యాలెండర్ల పేరుతో మోసం చేసి, గద్దె దిగి తిరిగి నేడు యువత పోరు పేరుతో డ్రామాలాడడం ఆ పార్టీకే చెల్లుతుందని టిడిపి నాయకులు రంగస్వామి నాయుడు, సందీప్ నాయుడు, బాష, ఐరన్ బండ బాష, నాగరాజు, రాంపురం రఫీ, జయపాల్, రమేష్ నాయుడు విమర్శించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం రూ.4,271 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బును బకాయి పెడితే అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే కూటమి ప్రభుత్వం రూ.788 కోట్ల బకాయిలు విడుదల చేసిందని తెలిపారు. నిరుద్యోగులు, యువతకు నోటిఫికేషన్లు విడుదల చేయకుండా జాబ్ క్యాలెండర్ పేరుతో గత వైసిపి ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. వారే తిరిగి ఇప్పుడు డ్రామాలాడడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు